క్లుప్తంగా

పరిశ్రమల్లో సీఎఫ్‌డీ పాత్రపై సదస్సు

కొమ్మాది: ఆటో మొబైల్ పరిశ్రమ రంగంలో కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ (సీఎఫ్‌డీ) పాత్రపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. చెన్నైకు చెందిన వాలియో సంస్థ సీనియర్ సీఎఫ్‌డీ ఇంజినీర్, గీతం పూర్వ విద్యార్థి పి.భాస్కరరావు పాల్గొని ప్రసంగించారు. వాహన ఎయిరో డైనమిక్స్, ఆటోమేటివ్ ఎలక్ట్రానిక్స్, బ్యాటరీ థర్మల్ మేనేజ్‌మెంట్ తదితర విభాగాల్లో సీఎఫ్‌డీ ప్రయోజనాలు వివరించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు సాఫ్ట్‌వేర్‌లపై పట్టు సాధించాలని, తద్వారా మంచి భవిష్యత్ ఉంటుందని ఆయన సూచించారు.

విద్యార్థినులకు అభినందనలు

భీమునిపట్నం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను భీమిలి సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో శనివారం అభినందించారు. అండర్ 14, 17 విభాగాల్లో ప్రవల్లిక, చిత్రభాను, భవానీ నాగప్రసన్న, పావని, మీనాక్షి, లలిత, గీతిక, ప్రసన్న, తేజశ్రీ, త్రిపుర ఎంపికయ్యారు. పాఠశాల కో ఆర్డినేటర్ సిస్టర్ దీప, సిస్టర్ మరియాగ్రేస్ పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

పీఎం పాలెం: ఓ విద్యార్థిని అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్మాది మారికవలస రాజీవ్ గృహకల్ప బ్లాకు నంబర్ 20 ఎస్ఎఫ్‌లో నివసిస్తున్న బాలిక (15) నగరంలోని స్కూలులో 10వ తరగతి చదువుతోంది. ఈ నెల 21న ఉదయం స్కూలుకు వెళ్లి తిరిగి రాలేదు. విద్యార్థిని తల్లి రమణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వే

పద్మనాభం: మండలంలోని 16 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో మూడు రోజుల నుంచి జగనన్న సురక్ష సర్వే గురువారం నుంచి నిర్వహిస్తున్నారు. ఈ సర్వే ద్వారా ప్రజల ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నారు. బీపీ, షుగర్ వంటి వ్యాధులను గుర్తిస్తున్నారు. వైద్యులు స్వప్న, మణికుమారి పర్యవేక్షణలో వైద్య సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు.

స్వచ్ఛతపై సేవా ర్యాలీ



నాటిన మొక్క వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

పద్మనాభం: మండలంలోని మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరుతూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం శాంతి ప్రసూన, పీడీ ఎస్.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రఘు'లో ముగిసిన సెమినార్

తగరపువలస: ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ మార్పుల నమూనా అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ భీమిలి మండలం దాకమర్రి రఘు ఫార్మసీ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈసీ సభ్యుడు సుజీత్, ఏయూ ఫార్మసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ రమణమూర్తి, ప్రిన్సిపాల్ జగదీష్ పాండా, రఘు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కలిదిండి రఘు పాల్గొన్నారు.

27న నిరశన ప్రదర్శన

మధురవాడ: విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా ఈ నెల 27న వామపక్షాల ఆధ్వర్యంలో సీతమ్మధారలోని ఏపీ ఈపీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీసు వద్ద నిరశన తెలుపుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిల్లి పైడిరాజు చెప్పారు. ఈ మేరకు జీవీఎంసీ 7వ వార్డు మల్లయ్యపాలెం పరిసర ప్రాంతాల్లో శనివారం కరపత్రాలు పంపిణీ చేశారు. వి.సత్యనారాయణ, ఎండీ బేగం, కె.మేఘూరావు, జి.వేళంగిని రావు, ఎంఎస్ పాత్రుడు, త్రినాథ్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మధురవాడ వికలాంగుల కాలనీలో లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: ప్రజలకు ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలతోపాటు మరింత మెరుగైన పాలన, ఇంటి వద్దకే రేషన్, పింఛన్ వంటివి అందాలన్నా, సచివాలయ, వలంటీర్ వ్యవస్థ కొనసాగాలన్నా మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డే ముఖ్యమంత్రి అయ్యేలా అంతా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ జోన్ – 2 పరిధి మధురవాడ వికలాంగుల కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో పలు నివాసాలకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయని, 15 రోజుల్లో పనులు చేపట్టి రెండు నెలల్లో పూర్తి చేస్తారన్నారు. అలాగే ఇక్కడ లో ఓల్టేజీ సమస్య, కొండపైకి మెట్లు, డ్రైనేజీ, కాలనీ నుంచి వైఎస్సార్ కాలనీ మీదుగా అప్రోచ్ రోడ్డు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, తహసీల్దార్ సనపల రమణయ్య, జెడ్సీ కనక మహాలక్ష్మి, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్, 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, బీఎంసీ డైరెక్టర్ జేఎస్ రెడ్డి, సంతోష్, పార్టీ మహిళా విభాగం వార్డు అధ్యక్షురాలు బండారు శివలక్ష్మి, రమణమ్మ, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, కల్లేపల్లి శంకరరావు, రుషికేష్, రైల్వే బోర్డు సభ్యుడు ఎన్.బాబ్జి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెంద్ర అప్పన్న, అల్లాడ లింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్ రైతులకు ఉచితంగా రిజిస్ట్రేషన్లు

తగరపువలస: ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా జగనన్న కాలనీలకు సంబంధించి ప్రభుత్వానికి భూములు ఇచ్చిన రైతులకు కేటాయించిన స్థలాలకు ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేసే కార్యక్రమం శనివారం భీమిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రారంభమయింది. ఈ ప్రయోజనం కింద నియోజకవర్గంలో భీమిలి మండలంలో 320, ఆనందపురంలో 850, పద్మనాభంలో 280 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. వీరిలో డి.పట్టా భూములు ఇచ్చినవారికి ఎకరాకు 900 గజాలు, ఆక్రమణలలో ఉన్నవారికి 450 గజాల వంతున కన్వేయన్సు డీడ్స్ ఇవ్వనున్నట్టు ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ వీరి రిజిస్ట్రేషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పద్మనాభం మండలానికి సంబంధించి 20 మంది రైతులకు శనివారం భీమిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేశారు. వీరి నుంచి ఎలాంటి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, సర్వీస్ చార్జీలు వసూలు చేయలేదు. ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ 10 రోజుల్లో పూర్తి చేయనున్నట్టు ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి రైతులకు దస్తావేజులు అందించే కార్యక్రమంలో భీమిలి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, భీమిలి సబ్ రిజిస్ట్రార్ తులసీదాసు పాల్గొన్నారు.



పద్మనాభం రైతులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అందిస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి తదితరులు

బొగ్గురోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణానికి సిద్ధం చేసిన మెటీరియల్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 1, 2 వార్డులను కలుపుతూ చిట్టివలస కనక మహాలక్ష్మి ఆలయం నుంచి జీరుపేట వరకు ఉన్న బొగ్గురోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. రెండేళ్లుగా వరుసగా కురిసిన వర్షాలకు ఈ రోడ్డు పలుచోట్ల ఛిద్రమైపోయింది. ఈ రెండు వార్డుల ప్రజల సౌకర్యార్థం రూ.75 లక్షల జీవీఎంసీ సాధారణ నిధులతో విస్తరణ పనులతోపాటు బీటీరోడ్డు వేయనున్నారు. ప్రారంభంలో 40 అడుగుల వెడల్పుతో నిర్మించడానికి చేసిన ప్రతిపాదనలు ప్రస్తుతం కాంట్రాక్టర్లు అమలు చేయడం లేదు. 26 అడుగుల మేర రహదారి, మిగిలిన 14 అడుగులకు డ్రైనేజీలను నిర్మించనున్నట్టు తెలిపారు. ఇప్పుడు నిర్మిస్తున్న రహదారి 16 అడుగులకు మించి లేదని స్థానికులు అంటున్నారు. నాసిరకం మెటీరియల్ వినియోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ నిధులతో పది కాలాలపాటు నిలిచిపోయేలా నిర్మించాల్సిన రహదారి పనులను అధికారులు పర్యవేక్షించాలని రెండు వార్డుల ప్రజలు కోరుతున్నారు.

గణపతి మండపాల వద్ద అన్నదానం



మద్దిలో అన్నదానం ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు



సద్గురు సాయినాథ కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు



తాటితూరు ఉత్కర్ష ఎమరాల్డ్ అపార్ట్‌మెంట్‌లో...

తగరపువలస : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో పలుచోట్ల మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీనగర్ యాతపేటలో 5 వేల మందికి, గాంధీబొమ్మ వీధిలో 4 వేల మందికి, తాటితూరు పంచాయతీ ఉత్కర్ష ఎమరాల్డ్ అపార్ట్‌మెంట్‌లో మూడు వేల మందికి అన్నదానం చేశారు. బొగ్గురోడ్డులోని సుభీభవ కాలనీ వద్ద నిర్వాహకులు భారీ అన్నదానం చేశారు. సంగివలస అనిట్స్ కళాశాల ఎదురుగా పోలమాంబ యూత్ ఆధ్వర్యంలో జరిగిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అక్కరమాని మంగరాజు ప్రారంభించారు.

పద్మనాభం: వినాయక ఉత్సవాల్లో భాగంగా మద్ది గ్రామంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు శనివారం అన్నదానం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, బాందేవుపురం కో – ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు బుగత శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆనందపురం : గంభీరంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ శనివారం అన్నదానం ప్రారంభించారు. రెండు వేల మందికి అన్నదానం చేశారు. వైస్ ఎంపీపీ బొట్టా ధనలక్ష్మి, బొట్టా రామకృష్ణ, ఉప్పాడ సూరిబాబు పాల్గొన్నారు.

మధురవాడ: జీవీఎంసీ 5, 7 వార్డుల్లోని గణపతి మండపాల వద్ద అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. శివశక్తినగర్ రోడ్డులోని సద్గురు సాయినాథ కాలనీలో ఏపీ నగరాలు కార్పొరేషన్ డైరెక్టర్ కురిటి లోహిత్ ఆధ్వర్యంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ అన్నప్రసాదం వడ్డించారు. 5వ వార్డు జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్, 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, గుంటబోయిన సంజీవ్ యాదవ్, పిళ్లా రమణ పాల్గొన్నారు.



గంభీరంలో అన్నదానం ప్రారంభిస్తున్న మహేష్

- మారికవలస ఆర్‌జీకే కాలనీలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు అన్నదానం ప్రారంభించారు. వెంకటేష్, చిన్నమనాయుడు, కందుకూరి రాజు, రుషికేష్ పాల్గొన్నారు. మధురవాడ రైతు బజార్‌లో ఈవో కృష్ణమూర్తి భక్తులకు, రైతులకు వడ్డన చేసి అన్నదానం ప్రారంభించారు.

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు కళ్లాలులోని దొర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ శనివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఉండబట్ల ఆదిలక్ష్మి ప్రసాదాలు అందించారు. అనంతరం మండపం వద్ద అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా 51 కిలోల లడ్డూకు వేలం నిర్వహించగా తాటితూరుకే చెందిన పల్లంటి శ్యామ్‌సుందరరావు రూ.63 వేలకు సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొయ్య శ్రీనివాస రెడ్డి, దుంపల ప్రభాకర్, గురునాయుడు, జాంబిరెడ్డి, గోపిశెట్టి గోవింద్ పాల్గొన్నారు.

గణేషుని మండపంలో ప్రత్యేక పూజలు



మధురవాడలో పూజలు చేస్తున్న భక్తులు



గొల్లవీధి మండపంలో పూజలు చేస్తున్న భక్తులు

మధురవాడ: వరసిద్ధి వినాయకుని ఆశీస్సులతో రాష్ట్రం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఏపీ నాగవంశం కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డు అప్పలనాయుడు దంపతులు స్వామికి ప్రార్థనలు చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం వారు మధురవాడ గాంధీనగర్ సత్యసాయి ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ ప్రెసిడెంట్ ప్రకాశ్, కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు, వెంకట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ తాతా థియేటర్ డౌన్‌లోని సూపర్ కింగ్స్ యూత్ బాయ్స్ నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవ కమిటీకి వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి, శిష్ట కరణాల సంఘం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి రమేష్ శనివారం రూ.25వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కంచుబోయిన వెంకటరావు, నీలాతి రాము తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస జాతీయ రహదారిపై శనివారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా రేగిడి మండలం కొండవలసకు చెందిన రైతు బెవర రమేష్ (26) దుర్మరణం చెందాడు. భీమిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం విశాఖలో ట్రాక్టర్ విడిభాగాలు కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చిన రమేష్ తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురై రోడ్డు పక్కన పడి ఉన్నాడు. భీమిలి పోలీసులు గుర్తించి సమాచారాన్ని మృతుని తండ్రి భాస్కరరావుకు తెలియచేశారు. భీమిలి ఎస్ఐ తాతారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్రెషర్స్ డే వేడుకలకు సీపీ

తగరపువలస: సంగివలసలోని అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, భీమిలి సీఐ డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లవీధి నుంచి ప్రయాణం నరకప్రాయం

వాహనదారుల రాకపోకలకు అవస్థలు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతపేట గొల్లవీధి నుంచి ప్రయాణం వాహనదారులకు నిత్యం నరకప్రాయంగా మారుతోంది. తాతా థియేటర్ నుంచి భీమిలి రోడ్డులోని విశాఖపట్నం కో ఆపరేటివ్ సహకార బ్యాంకు బ్రాంచి వరకు రహదారి ఇరుకుగా ఉంటుంది. ఈ మార్గంలో ఒక్క వాహనం మాత్రమే వెళ్లేందుకు సరిపడా రహదారి ఉంది. కానీ ఉదయం, సాయంత్రం వేళల్లో నిత్యం ఇరువైపులా వాహనాలు ఎదురైనప్పుడు మిగిలిన వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంత ఇరుకైన మార్గంలో ఒక్క వాహనానికే దారి ఉంటే వ్యాపార కేంద్రాలకు, హోటళ్లకు వచ్చేవారు, నివాస గృహాలు కలిగిన వారు ద్విచక్ర వాహనాలను దర్జాగా రోడ్లపై పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. అంతేకాకుండా ఈ ఇరుకైన మార్గంలో హోల్‌సేల్ వ్యాపారుల గొడౌన్‌లు ఉండడంతో తరచూ లోడింగ్, అన్‌లోడింగ్‌కు వాహనాలను గంటల తరబడి నిలిపివేస్తున్నారు.



సంతపేట గొల్లవీధిలో ఇరువైపులా వాహనాల రాకతో స్తంభించిన ట్రాఫిక్

రహదారిపైకి ఆక్రమణలు..

ఇరుకైన గొల్లవీధి మార్గంలో ఇరువైపులా నివసిస్తున్న వారు, వ్యాపారులు డ్రైనేజీలను ఆక్రమించి రహదారిపైకి నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయం భీమిలి జోన్ టౌన్ ప్లానింగ్ అధికారులకు తెలిసినా చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం స్కూల్‌కు వెళ్లేటప్పుడు, సాయంత్రం తిరిగి వచ్చేటప్పుడు పదుల సంఖ్యలో విద్యాసంస్థలకు చెందిన బస్సులు ఎదురైతే కనీసం 20 నిమిషాలపాటు ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఇరువైపులా రహదారులపైకి వచ్చిన ఆక్రమణలు తొలగించడంలో భీమిలి టౌన్ ప్లానింగ్ సిబ్బంది, దుకాణాలు, ఇళ్ల ముందు నిలిపి ఉంచుతున్న ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేయకుండా భీమిలి ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుని వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

75 మందికి కంటి వైద్య పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

ఆనందపురం : మండలంలోని బోని గ్రామంలో వైఎస్సార్ కంటి వెలుగు అవ్వాతాత పథకంలో భాగంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు 75 మంది కంటి రోగులను పరీక్షించి అందులో 33 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయడానికి నిర్ణయించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ఎంతో మంది పేదలకు ఉపయోగకరంగా మారిందని, గ్రామీణ ప్రాంతాల వారు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బోని అప్పలకొండ, బోని సన్యాసినాయుడు, ఆస్పత్రి సిబ్బంది గంగాధర్, నర్సింగ్, గీతా సాయి కో – ఆర్డినేటర్ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.